క్లుప్తంగా

నవమి వేడుకలకు అంకురార్పణ



పూజలు చేస్తున్న నాయకులు, కమిటీ సభ్యులు

ఏలేశ్వరం: శ్రీరామనవమి వేడుకలకు నియోజక వర్గ వ్యాప్తంగా బుధవారం అంకురార్పణ చేశారు. ఈనెల 30వ తేదీన శ్రీరామనవమిని పురస్కరించుకుని రామాలయాల వద్ద పందిరి రాట వేశారు. ప్రతి ఏడాది నూతన సంవత్సరం రోజున నవమి వేడుకలకు అంకురార్పణ చేయడం ఆనవాయితీగా వస్తుంది. పట్టణం లోని 10వ వార్డు పరిధిలోని పైడిమల్లమ్మ గుడి సమీపంలోని రామాలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పందిరి రాట వేశారు. వైఎస్సార్ సీపీ నేత, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్, కోరాడ ప్రసాద్, ప్రత్యేక పూజలు చేశారు. కొట్టేడి రాజు, గండేటి వేణు, తుమ్మలపల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

చలమయ్యకు సత్కారం

ఏలేశ్వరం: వీరమణికంఠ భక్తసమాజం ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం వైఎస్సార్ సీపీ నేత, మున్సిపల్ కౌన్సిలర్ అలమండ చలమయ్యను ఘనంగా సత్కరించారు. భక్త సమాజం సభ్యులు చలమయ్యకు పూలమాలలు వేసి సత్కరించారు. చలమయ్య మాట్లాడుతూ భక్తసమాజం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. సభ్యులు గూడవిల్లి అర్జునరావు, అడపాదుర్గారావు, శ్రీను, బాబు పాల్గొన్నారు.

బాధితులకు సాయం

ఏలేశ్వరం: నాసా సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల పట్టణంలో అగ్నిప్రమాదంలో తాటాకిళ్లు దగ్ధమైన బాధితులకు బుధవారం సాయం అందజేశారు. సంస్థ డైరెక్టర్ సుజ్రత్ ఆధ్వర్యంలో బాధితులు వెంకటలక్ష్మి, వీరబాబులకు బియ్యం, దుస్తులు, నిత్యావసరాలు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ఆర్గనైజర్ విదొంగబాబు, కావేరి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మెషీన్ల పంపిణీ

ప్రత్తిపాడు: స్థానిక సెంటినరీ బాప్టిస్ట్ చర్చి ఆవరణలో మంగళవారం రాత్రి కుట్టు మెషీన్లు పంపిణీ చేశారు. విశాఖ క్రిస్టియన్ లైఫ్ సెంటర్ (సీఎల్‌సీ) మినిస్ట్రీస్ అధినేత మహంతి 25 మంది వితంతువులు, పేద మహిళలకు కుట్టు మెషీన్లు అందజేశారు. వాటిని ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, ఎంపీపీ గోళ కాంతి సుధాకర్, గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి చేతుల మీదుగా పంపిణీ చేశారు. సంఘ ప్రతినిధి గుడాల సుందరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ చైర్మన్ జాన్ వెస్లీ, బ్యాక్ టు ది బైబిల్ స్కూల్ వ్యవస్థాపకుడు డేవిడ్ స్వామి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం, చర్చి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తుని రూరల్: తుని అర్బన్, రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న మూడు అంగన్‌వాడీ కార్యకర్తలు, తొమ్మిది సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తుని సీడీపీఓ కె.నాగలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు, సహాయకులకు దరఖాస్తులు చేసే మహిళలు స్థానికులు, వివాహితులు, పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 2022 జూలై ఒకటికి 21ఏళ్ల నుండి 35 ఏళ్ల లోపు వయసు ఉండాలన్నారు. దరఖాస్తులను ఈనెల 31వ తేదీలోగా తహసీల్దార్ కార్యాలయంలో అందజేసి రసీదు పొందాలన్నారు.

కార్యకర్తల ఖాళీల వివరాలు : తొండంగి మండలం ఎర్రయ్యపేట (బీసీఈ), కొత్త చోడిపల్లిపేట (ఓసీ), తుని మండలం చామవరం (బీసీఈ) ఖాళీలు ఉన్నాయన్నారు.

సహాయకుల పోస్టులు : తుని పట్టణం 15 వార్డు పార్కు వీధి (ఓసీ), 23వార్డు ఉప్పర గూడెం (ఎస్టీ), తుని మండలం అటికెవానిపాలెం (బీసీఈ), తేటగుంట గవరపేట (ఓసీ హెచ్‌హెచ్), జెల్లేడుపాడు (ఎస్సీ), తొండంగి మండలం పి.అగ్రహారం (బీసీడీ), వి.పంపాదిపేట (ఓసీ డబ్ల్యూ), పాత చోడిపల్లిపేట (బీసీబీ), కోటనందూరు మండలం కె.ఈ.చిన్నయ్యపాలెం (ఓసీ) ఖాళీలు ఉన్నాయన్నారు.

జగ్గంపేట: మండలంలో ఖాళీగా వున్న కాట్రావులపల్లి అంగన్‌వాడీ కేంద్రం-1 లో హెల్పర్(ఓసీ), భావవరంలో వర్కర్(ఎస్సీ)పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఐసీడీఎస్ జగ్గంపేట ప్రాజెక్టు అధికారి పూర్ణిమ బుధవారం తెలిపారు. ఈ నెల 31వ తేదీలోపు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా సత్యప్రభ

ప్రత్తిపాడు: టీడీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జిగా మాజీ డీసీసీబీ చైర్మన్ వరుపుల రాజా సతీమణి సత్యప్రభను నియమిస్తూ రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు బుధవారం ఉత్తర్వులిచ్చారు. ఇటీవల వరుపుల రాజా మృతి చెందిన సంగతి తెలిసిందే. పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఇన్‌చార్జిగా వరుపుల సత్యప్రభను నియమించారు.

వరుపుల రాజాకు నివాళి

వరుపుల సత్యప్రభను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించడంపై టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అధ్యక్షతన స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం కార్యకర్తల సమావేశం జరిగింది. పార్టీ విజయానికి కృషి చేయాలని జ్యోతుల నెహ్రూ కోరారు. అనంతరం ర్యాలీగా వరుపుల విగ్రహం వద్దకు చేరుకుని నివాళులర్పించారు.



ఏలేశ్వరంలో పంచాంగ శ్రవణంలో పూజలు చేస్తున్న చైర్‌పర్సన్ సత్యవతి, చలమయ్య దంపతులు



పాదాలమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ దొరబాబు



జి.కొత్తపల్లిలో పంచాంగ పఠనం నిర్వహిస్తున్న పండితులు



గోకవరంలో పంచాంగ పఠనం చేస్తున్న వేదపండితులు ద్విభాష్యం సూర్యవెంకట సుబ్బారావుశర్మ

అంతా శోభకృతమే..

- వాడవాడలా ఉగాది వేడుకలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- తలుపులమ్మ లోవలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న చైర్మన్, ధర్మకర్తలు, భక్తులు

శ్రీశోభకృత్ నామ సంవత్సరాది వేడుకలు వాడవాడలా ఘనంగా జరుపుకొన్నారు. పట్టణాలు, గ్రామాల్లో చిన్నా పెద్దా అంతా సందడి చేశారు. తెలుగుతనం ఉట్టిపడేలా సాంప్రదాయ దుస్తులు ధరించి, పిండి వంటలు చేశారు. షడ్రుచుల సమ్మేళనంతో ఉగాది పచ్చడి రుచి చూశారు. ఆలయాల్లోనూ, గ్రామ దేవతలకు పూజలు చేశారు. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజవర్గాల్లోని మండలాల్లో అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి, పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ ఏడాది అంతా శుభమే జరుగుతుందని పండితులు తెలిపారు.



లోవలో పంచాంగ పఠనం చేస్తున్న వేదపండితులు, పాల్గొన్న చైర్మన్ అచ్చియ్యనాయుడు, విశ్వనాథరాజు, ధర్మకర్తలు

తుని రూరల్: సర్వమానవాళికి శుభాలను కలిగించేదే శోభకృత్ నామ సంవత్సరమని తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానం వేదపండితులు పేర్కొన్నారు. బుధవారం కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు ఆధ్వర్యంలో వేద పండితులు, ప్రధాన అర్చకులు పురుషోత్తమ తెలుగు సంవత్సరాది ఉగాది పంచాగం చదివి వినిపించారు. పంచాంగాన్ని అనుసరించి ఈ సంవత్సరం సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలు, ధన ధాన్యాలతో ప్రజలు సు భిక్షంగా ఉంటారన్నారు. జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం కావడంతో తలుపులమ్మ అమ్మవారికి ఆదాయం 14, వ్యయం 11, రాజపూజ్యం ఏడు, నీలాప నిందలు ఏడుగా ఉందన్నారు. ప్రజలు భక్తిభావం, ఆధ్యాత్మిక చింతనతో మెలగాలన్నారు. అనంతరం లోవ దేవస్థానం ముద్రించిన శోభకృత్ నామ సంవత్సర పంచాంగ ప్రతులను ఈఓ, ధర్మకర్తలతో చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు భక్తులకు పంచారు. తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదంగా ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. వేదపండితులు రాణి సుబ్రహ్మణ్యశర్మ, శశాంక్ త్రిపాఠి, ప్రధాన అర్చకులు త్రినాథరావు, దేవస్థానం ఉద్యోగులు పాల్గొన్నారు. తుని మండల గ్రామాల్లోని వివిధ ఆలయాల్లో అర్చకులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేసి, వారి నక్షత్రం, రాశుల అనుగుణంగా ఆదాయ, వ్యయాలు, రాజపూజ్యం, అవమానాలను తెలిపారు.

ఏలేశ్వరం: శ్రీశోభకృత్ నామ సంవత్సర వేడుకలు నియోజకవర్గ వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామగ్రామాన పండితుల సమక్షంలో పంచాంగ శ్రవణం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి ఆధ్వర్యంలో స్థానిక నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో వేదపురోహితుడు గాదావర్ధుల సూర్యనారాయణ, బోడెం శ్రీకాంత్‌శాస్త్రి పంచాంగ శ్రవణం చేశారు. తొలుత చైర్‌పర్సన్ సత్యవతి, చలమయ్య, వైస్ చైర్‌పర్సన్లు శిడగం త్రివేణి, వెంకటేశ్వరరావు దంపతులు పట్టణ ప్రజలు ఈ ఏడాదంతా సుఖసంతోషాలు ఉండాలని కోరుకుంటూ ప్రత్యేక పూజలు చేశారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఈ ఏడాదంతా అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, పార్టీ నాయకులు దిలబర్‌హుస్సేన్, వాగుబలరామ్, దోకిషోర్, సుంకరరాంబాబు, దాకమర్రిలోవరాజు, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

గండేపల్లి: మండలంలో శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. తాళ్లూరు బాలత్రిపుర సుందరి రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉగాది ఉత్సవాలు ఘనంగా జరిగాయి.

గోకవరం: తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను మండల ప్రజలు బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. గోకవరంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ పంచాంగ శ్రవణం చేశారు. అదే విధంగా స్థానిక దాసరి వారి వీధిలోని రామాలయంలో ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వేదపండితులు ద్విభాష్యం సూర్యవెంకటసుబ్బారావు శర్మ పంచాంగ శ్రవణం చేశారు.

శంఖవరం: మండలంలో ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. శంఖవరంలో సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గ్రామస్తులకు ఉగాది పచ్చడి అందజేశారు.

ప్రత్తిపాడు: శ్రీశోభకృత నామ సంవత్సరాది ఉగాది వేడుకలు మండలంలో ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామి వారి పంచాయతన ఆలయంలో ఆలయ ప్రధానార్చకుడు కొత్తలంక సాయిశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

కిర్లంపూడి: ఉగాది సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పంచాంగ శ్రవణం చేశారు. చిల్లంగిలో అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.



పెద్దిపాలెంలో నూకాలమ్మతల్లిని దర్శించుకొంటున్న చిన్నారులు



చిల్లంగిలోని విశ్వేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు భక్తులు

రహదారుల ఆధునీకరణకు ప్రాధాన్యం



ఎస్.అన్నవరంలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా, ఎంపీ వంగా గీత

- మంత్రి దాడిశెట్టి రాజా, పాల్గొన్న ఎంపీ వంగా గీత
- రూ.18కోట్ల పనులకు శిలాఫలకం ఆవిష్కరణ

తుని రూరల్: రహదారుల ఆధునీకరణకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా పేర్కొన్నారు. తుని నుంచి ఎస్.అన్నవరం, తొండంగి మండలం పైడికొండ వరకూ 9.70 కిలో మీటర్ల రహదారి ఆధునీకరణకు రూ.18కోట్లతో చేపట్టనున్న పనులకు కాకినాడ ఎంపీ వంగా గీతతో కలసి మంత్రి శిలాఫలకాన్ని బుధవారం ఆవిష్కరించారు. అంతకు ముందు తన కార్యాలయంలో దాడిశెట్టి రాజా విలేకర్లతో మాట్లాడారు. రహదారుల నిర్మాణం, ఆధునీకరణ పనులు నిరంతరం కొనసాగే ప్రక్రియన్నారు. ప్రధాన రహదారులతో పాటు మండల కేంద్రాలకు అనుసంధానంగా ఉన్న ఆర్అండ్‌బీ రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. కార్యకర్తలు, నాయకులు, అభిమానులు మంత్రి రాజాను కలసి జన్మదిన, తెలుగు సంవత్సరాది ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. పెరిక కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ పురుషోత్తం గంగాభవానీ, మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, లోవ దేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, మున్సిపల్ చైర్మన్ ఏలూరి సుధారాణి, ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, జెడ్పీటీసీ పోతల సూర్యమణి, పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకట్రావు, డీసీసీబీ డైరెక్టర్ పోలిశెట్టి సోమరాజు, ఆర్ అండ్ బీ డీఈ అంబటి ప్రకాశరావు పాల్గొన్నారు.

అనాథలకు ఉచిత దహన సంస్కారాలు

గోకవరం: స్థానిక హిందూ శ్మశానవాటికలో అనాథ శవాలకు ఉచితంగా దహన సంస్కారాలు నిర్వహిస్తామని గోకవరం సొసైటీ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దాసరి తమ్మన్నదొర తెలిపారు. శ్మశానవాటికలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి బుధవారం గ్రామపెద్దలు నూతన వస్త్రాలు అందజేశారు. అనాథలకు ఉచితంగా దహన సంస్కారాలు నిర్వహించడంతో పాటు పేదలకు అతి తక్కువ ఖర్చుతో వాహన సదుపాయం కల్పిస్తున్నట్టు తమ్మన్నదొర తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు దాసరి రమేష్, సుంకర వీరబాబు, కర్రి సూరారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు గాజింగం సత్తిబాబు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, సుంకర వీరబాబు, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి నూతన వస్త్రాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అలరించిన రంగవల్లుల పోటీలు



బహుమతులు అందుకుంటున్న విజేతలు

ప్రత్తిపాడు రూరల్: పెద్దిపాలెంలో నూకాలమ్మ తల్లి జాతరలో భాగంగా పీడీవై హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన రంగవల్లుల పోటీలు స్థానికులను ఆకట్టుకున్నాయి. ఈ ముగ్గుల పోటీల్లో 40 మంది మహిళలు పాల్గొన్నారు. వీరిలో ప్రథమ బహుమతి కొరుప్రోలు హైమా, ద్వితీయ బహుమతి రీసు శ్రీదేవి, తృతీయ బహుమతి లావేటి ఐశ్వర్య, 4వ బహుమతి సంధ్య, సత్యజ్యోతిక, 5వ బహుమతి దేవర శ్రీకన్య సాధించారు. వారికి దాతల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. న్యాయవాది అవసరాల దేవి, పావని, సుగుణ, విజయ కుమారి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ ముగ్గుల పోటీలను పండితుడు చీకట్ల వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

తుని: ఎస్సీ వర్గీకరణకు చట్ట బద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల 4న హైదరాబాద్, విజయవాడ నగరాల ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తుని నియోజకవర్గం ఎంఆర్పీఎస్ అధ్యక్షుడు కింతాడ సత్తిబాబు బుధవారం ప్రకటనలో కోరారు. ఎస్సీ వర్గీకరణపై బీజేపీ ప్రభుత్వం స్పందించక పోవడంతో ఈ నెల 28న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఎంఆర్పీఎస్ తుని నియోజకవర్గ కార్యదర్శి కె.అశోక్‌కుమార్, పి.ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

కిర్లంపూడి: కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటనపై బుధవారం కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. వారి తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట గ్రామానికి చెందిన మోర్త స్వామి(36) తూముపై నుంచి అదుపుతప్పి కాలువలో పడి మరణించిన సంఘటన విదితమే. దీనిపై మృతుడి తమ్ముడు రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కవులకు సన్మానం

కిర్లంపూడి: తామరాడ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు బాల కవులుగా ఎంపికయ్యారు. పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కవి తరగటి విజయరత్నం, ప్రసన్నకుమారి దంపతులను, వారి శిష్యులను బుధవారం కాకినాడలో జరిగిన సాహిత్య సదస్సులో ఘనంగా సత్కరించారు. ఉగాది పండగను పురస్కరించుకుని కాకినాడలో దాడి చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక, సాహిత్యకళ, సేవారంగాల సాహిత్య సదస్సులో కవి సమ్మేళనం, క్విజ్ నిర్వహించారు. కవి తిరగటి విజయరత్నం దంపతులతో పాటు వారి శిష్యులు పేకేటి గ్రేసి, నల్లా దేవి, హేమపద్మలు పలు సామాజిక అంశాలపై కవితలు వినిపించి ఆకట్టుకున్నారు. దీంతో వారిని బంగారు పతాకాలు, జ్ఞాపికలతో నిర్వాహకులు సన్మానించారు.



ఉత్తమ బాలకవులను బంగారు పతకాలు, జ్ఞాపికలతో సన్మానిస్తున్న నిర్వాహకులు

పలువురికి సత్కారం

గోకవరం: హిందూ ధర్మ అభివృద్ధికి సహకరిస్తున్న గోకవరానికి చెందిన పలువురిని సనాతన ధర్మ ప్రబోధనా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయిబాబు ఆధ్వర్యంలో గోకవరం హిందూ శ్మశానవాటిక నిర్వహణలో కీలకపాత్ర పోషిస్తున్న ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వీరబాబు దంపతులను, ఇంటింటికీ రామాయణ గ్రంథాన్ని పంపిణీ చేయడంతో పాటు అన్నమాచార్యుని విగ్రహానికి, ధార్మిక కార్యాక్రమాలకు సహకరిస్తున్న ప్రముఖ వ్యాపారవేత్త అక్షింతల రాజా, రాజా పబ్లిక్ స్కూల్ అధినేత పట్నాల సూర్యప్రకాశ్‌రావులను పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. సమితి సభ్యులు కొత్తపల్లి సత్యనారాయణ, పాపారావు, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి రాజా జన్మదిన వేడుకలు



పెరుమాళ్లపురంలో కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన వైఎస్సార్ సీపీ నాయకులు



జగన్నాథపురంలో చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీనివాసు తదితరులు

తొండంగి: మండల వ్యాప్తంగా బుధవారం రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా జన్మదిన వేడుకలను వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పెరుమాళ్లపురం, దానవాయిపేట, తొండంగి, సీతారాంపురం, కోదాడ, ఎ.వి.నగరం తదితర గ్రామాల్లో పార్టీనాయకులు కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, పార్టీ సీనియర్ నాయకులు కొయ్యా మురళి, గాబు రాజు, బద్ది నూకరాజు, మేరుగు ఆనందహరి, మడదా హేమంత్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కోటనందూరులో...

కోటనందూరు: మండల వ్యాప్తంగా మంత్రి దాడిశెట్టి రాజా జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కోటనందూరులో సర్పంచ్ గర్సింగు శివలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎంపీపీ లగుడు శ్రీనివాసు పాల్గొని కేక్ కట్ చేసి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. జగన్నాధపురంలో ఎంఆర్పీఎస్ మండలాధ్యక్షుడు ఆరుగుల మోషే ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీపీ పాల్గొన్నారు. అక్కడ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేసి మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పేద మహిళలకు ఎంపీపీ చేతుల మీదుగా చీరలు పంపిణీ చేశారు. లోవదేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గర్సింగు దొరబాబు, మల్లంపల్లి ప్రకాష్, దార్ల సూర్యచంద్ర, కురందాసు రాంబాబు, ఉల్లూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శోభాయమానంగా రత్నగిరి

- వెండి గజవాహనంపై సత్యదేవుడు, అమ్మవార్ల ఊరేగింపు

అన్నవరం: ఉగాది సందర్భంగా రత్నగిరి సత్యదేవుని ఆలయం పుష్పాలంకరణతో శోభాయమానంగా దర్శనమిచ్చింది. స్వామివారి ఆలయ ప్రాంగణం, అనివేటి మండపాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అనివేటి మండపం వెలుపల పుష్పాలంకరణ మధ్య ఏర్పాటు చేసిన సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరుల ఉత్సవమూర్తులు, తూర్పు రాజగోపురం వద్ద చేసిన పుష్పాలంకరణ అందరినీ ఆకర్షించింది. దీంతో భక్తులు రెండు చోట్ల భక్తులు ఫొటోలు దిగడానికి ఆసక్తి చూపడంతో అక్కడ రద్దీ ఏర్పడింది.

సత్యదేవుని దర్శించిన 40 వేల మంది భక్తులు

ఉగాది పర్వదినం సందర్భంగా సుమారు 40 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది. సత్యదేవుని దర్శనానికి రెండు గంటలు, ప్రత్యేక దర్శనానికి గంట సమయం పట్టింది. స్వామివారి వ్రతాలు రెండు వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది.



గజవాహనం మీద సత్యదేవుడు, అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

గజవాహనంపై సత్యదేవుని ఊరేగింపు

గ్రామంలో బుధవారం రాత్రి సత్యదేవుడు, అమ్మవారిని వెండి గజవాహనంపై ఊరేగించారు. రాత్రి 7-30 గంటలకు సత్యదేవుడు, అమ్మవారిని ఆలయం నుంచి మెట్ల మార్గాన పల్లకీ మీద ఊరేగింపుగా కొండ దిగువకు తీసుకువచ్చారు. అక్కడ వెండి గజవాహనం మీద స్వామి, అమ్మవార్లను ప్రతిష్ఠించి పూజలు చేశారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్‌స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను గ్రామంలో ఘనంగా ఊరేగించి తిరిగి ఆలయానికి చేర్చారు.



సత్యదేవుని ఆలయం వద్ద పుష్పాలంకరణ దృశ్యం

అరుణాచల క్షేత్రంలో కామధేను మహా యజ్ఞం

ప్రత్తిపాడు రూరల్: రాచపల్లి శ్రీరమణా సేవా ఆశ్రమంలోని అరుణాచల క్షేత్రంలో కామధేను మహా యజ్ఞాన్ని నిర్వహించారు. లక్షా ఎనిమిది వేల గోవు పిడకలు, 250 కేజీల ఆవునెయ్యి, ఒక టన్ను సమ్మెదెలు, సుగంధ ద్రవ్యాలతో ఈ మహా యజ్ఞాన్ని 108 మంది వేద పండితులతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అఖిల భారత హిందూ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీఆర్ శాస్త్రీ చేతుల మీదుగా కామధేను మహా యజ్ఞాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీ ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. దీంతో ఆలయ ప్రాంగాణంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఆశ్రమ పీఠాధిపతి రమణ స్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలు



ఏలేశ్వరంలో అర్చకులను సన్మానిస్తున్న విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు

ఏలేశ్వరం: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక సత్యనారాయణస్వామి ఆలయంలో బుధవారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిణి ఆధ్వర్యంలో గోపూజ, విష్ణు, సహస్ర పారాయణ చేశారు. శ్రీమాన్ చినజీయర్ స్వామిజీ శిష్యురాలు వాగు రోహిణి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. అనంతరం ఉగాది పురస్కరించుకుని అర్చకులు పొన్నూరు సత్యనారాయణచార్యులు, లక్ష్మీనరసింహచార్యులను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు ఏడీవీ ప్రసాద్, కటకం కిరిటీ, తూమురౌతు గురయ్య, ఉడతల రమణారావు, సంఘ మహిళాసభ్యులు పాబోలు దేవి, మల్లేశ్వరీ, కల్యాణి, ఇందిరాప్రియదర్శిని, పాబోలు సుజాత, కొత్తరమాదేవి, ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

జగ్గంపేట: స్థానిక కాకినాడ రోడ్డులోని బాలాజీ జ్యూవెలర్స్ వద్ద వాసవీ క్లబ్, ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని బుధవారం జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ ప్రారంభించారు. మజ్జిగ, తాగునీరు, ఉగాది సందర్భంగా ఉగాది పచ్చడిని బాటసారులకు పంచిపెట్టారు. ప్రతిరోజు మజ్జిగ, చల్లటి తాగునీరు అందించనున్నట్టు ఆర్యవైశ్య సంఘం తెలిపింది. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సేవాసంఘం అధ్యక్షుడు కొత్త కొండబాబు, వాసవీ క్లబ్ అధ్యక్షులు బొండాడ రాజేష్, సౌమ్య, ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు మానేపల్లి బంగార్రాజు, కంచర్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

జూదం, కోడి పందేలపై పోలీసుల దాడులు

17 మంది అరెస్టు, రూ.6,700 స్వాధీనం



కాట్రావులపల్లిలో కోడిపందేలు ఆడుతున్న వారిని అరెస్టు చేసిన పోలీసులు

జగ్గంపేట: మండలంలోని పలు గ్రామాలలో కోడి పందేలు, జూదం ఆడుతున్న ప్రాంతాలపై జగ్గంపేట పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో 17మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.6,700 స్వాధీనం చేసుకున్నట్లు జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని రామవరం గ్రామ శివార్లలో కోడిపందేలు ఆడుతున్న ఐదుగురిని, కాట్రావులపల్లి గ్రామ శివారులో కోడిపందేలు ఆడుతున్న ఎనిమిది మందిని, పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేశామని తెలిపారు. వీరిని గురువారం కోర్టుకు తరలిస్తామని వివరించారు.

జాతర్లకు పోటెత్తిన భక్తులు

గోకవరం: మండలంలో పలు గ్రామాల్లో జరుగుతున్న అమ్మవారి జాతర్లకు భక్తులు పోటెత్తారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో కొలువైన గ్రామదేవత గుబ్బాలమ్మ ఆలయానికి బుధవారం భక్తులకు భారీగా తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కొత్తపల్లిలోని గ్రామదేవత నూకాలమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. ఆయా ఆలయాల వద్ద భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా నూకాలమ్మ జాతర

కిర్లంపూడి: నూకాలమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా రంగురంగుల విద్యుత్ దీపాల వెలుగుల్లో భక్తులు సందడి చేశారు. స్థానిక, పరసర గ్రామాలకు చెందిన వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.